శిథిల బడిలో అవస్థలు

వర్షాలకు ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి

- భయాందోళనలో విద్యార్థులు
- ఆందోళన చెందుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు
- పట్టించుకోని అధికారులు


శిథిలావస్థ స్థితిలో పాఠశాల భవనం

రామాయంపేట(మెదక్): శిథిలమైన బడిలో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. తరగతి గదుల్లో కూర్చోవడానికి విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుత వర్షాలతో ఎప్పుడు కూలుతుందో తెలియని పరిస్థితి ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు మాత్రం స్పందించడం లేదని వారు విమర్శిస్తున్నారు.

రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలోని మార్కెట్‌లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరుకుంది. ఈ స్కూలులో ఆరునుంచి పదో తరగతి వరకు మొత్తం 156 మంది విద్యార్థులు ఉన్నారు. భవన సముదాయంలో ఉన్న తొమ్మిది గదులు పాక్షికంగా శిథిలమయ్యాయి. పైకప్పు శిథిలమై నీరు ఉరుస్తోంది.


శిథిలమైన గదిలో విద్యార్థులు

నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో గదుల్లో విద్యార్థులపైననే ఉరుస్తుంది. కాగా ఈ పరిస్థితుల్లోనే ఉపాధ్యాయులు చదువు చెప్తున్నారు. వర్షం పడిన రోజు స్కూలుకు సెలవు ప్రకటించకుండా


గది పైకప్పులో తేలిన ఇనుప చువ్వలు

కొనసాగిస్తే ఏదైనా ప్రమాదం జరిగే ఆస్కారం ఉందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయం ఉన్నత అధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు ఉపాధ్యాయులు పేర్కొన్నారు.

అధ్వానంగా గురుకులం స్నానపుగదులు


కొడిపల్లిలో అధ్వానంగా ఉన్న గురుకులం బాత్‌రూంలు

కౌడిపల్లి(నర్సాపూర్): మండల కేంద్రమైన కౌడిపల్లి ఎస్టీ బాలికల మినీ గురుకులంలో బాత్‌రూములు అధ్వానంగా ఉండడంతో విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గురుకులంలో 1 నుండి 5వ తరగతి వరకు 150 విద్యార్థులు ఉన్నారు. బోరునీటి సౌకర్యం సైతం ఉంది. ఇందులో ఏడు బాత్‌రూములు, ఐదు మరుగుదొడ్లు ఉండగా, అన్ని అధ్వానంగా ఉన్నాయి. కాంట్రాక్టర్ నిర్లక్ష్యంగా నిర్మాణ పనులు చేయడంతో, డోర్లు, ట్యాప్‌లు సరిగ్గా పని చేయడం లేదు. బాత్‌రూంలలో ఉండే శ్లాబ్ పెచ్చులు ఊడిపడడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. గతంలో బాత్‌రూం పక్కకు ఉన్న చెట్టు కొమ్మ విరిగిపడి విద్యార్థులకు గాయాలైన సంఘటనలు ఉన్నాయి. ఇకనైనా అధికారులు స్పందించి, బాత్‌రూంలు బాగుచేయాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

సామాజిక తనిఖీపై నేడు ప్రజాదర్బార్

కొల్చారం(నర్సాపూర్): మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ మహిపాల్ రెడ్డి తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద మండలంలో పనులపై సామాజిక తనిఖీలో భాగంగా మంగళవారం ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్లు ఏపీఓ చెప్పారు. ఎంపీడీఓ సమావేశ మందిరంలో ఉదయం 10 గంటలకు ప్రజా దర్బార్ ఉంటుందన్నారు.

నేడు రుణమాఫీ పత్రాల పంపిణీ

శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేట ప్రాథమిక సహకార సంఘం ఆధ్వర్యంలో రైతులు తీసుకున్న రుణాలకు సంబంధించి మాఫీ పత్రాలు మంగళవారం పంపిణీ చేస్తున్నట్లు చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి తెలిపారు.

రైతుల దీక్షలు పట్టించుకోని ప్రభుత్వం


రిలే దీక్షలకు సంఘీభావం తెలిపిన సీపీఎం ఇతర సంఘాల నాయకులు

నర్సాపూర్: తమకు న్యాయం చేయాలని రైతులు రిలే నిరాహార దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకరమని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం అన్నారు. కొండపోచమ్మ కాల్వ వద్దు, సెమీ అర్బన్ ముద్దు నినాదంతో సంగారెడ్డి రీచ్ -2 కాల్వకు భూములు ఇవ్వమని ఆయా గ్రామాల రైతులు చేస్తున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 18వ రోజుకు చేరాయి. ఈ దీక్షలకు ఆయన సంఘీభావం తెలిపి మాట్లాడుతూ.. రైతులు దీక్షలు చేస్తున్నా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అసెంబ్లీలో రైతుల సమస్యపై చర్చ జరగాలని అన్నారు. మార్కెట్‌లో భూముల ధరలు బాగా పెరిగినందున ప్రభుత్వం ఇచ్చే పరిహారంతో రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని, వారు నష్టపోకుండా న్యాయం చేయాలని తెలిపారు. దీక్షలకు రైతు రక్షణ సమితి జిల్లా అధ్యక్షుడు మైసయ్యయాదవ్, సీపీఎం, ఆయా సంఘాల నాయకులు నాగరాజు, చంద్రశేఖర్ సంఘీభావం తెలిపారు. దీక్షలో చెన్నాపూర్, బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట గ్రామాల రైతులు నర్సింహరెడ్డి, అంజాగౌడ్, నారాయణ, రాంకిషన్, రాజమౌళి, ప్రేంచరణ్, తుక్కయ్య, మహేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

విద్యుత్ వైర్లు తగిలి లారీ దగ్ధం

పెద్దశంకరంపేట(మెదక్): పేట శివారులోని తిరుమలాపూర్ వద్ద విద్యుత్ తీగలు తగిలి టిప్పర్‌కు నిప్పంటుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బీహార్ రాష్ట్రానికి చెందిన దీపక్ అనే డ్రైవర్ టిప్పర్‌లో మొరం తీసుకొని వెళ్లి ఓ భూమిలో ట్రాలీనీ లేపి వేస్తుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లకు తగిలింది. దీంతో డ్రైవర్ వెంటనే వాహనం నుంచి కిందికి దూకాడు. అప్పటికే కొంత విద్యుత్‌షాక్ తగలడంతో స్వల్పగాయాలతో బయటపడ్డాడు. ఈ సంఘటనలో లారీ టైర్లు, ఇతర సామగ్రి దగ్ధమైంది. స్థానికులు ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించడంతో వారు సంఘటనాస్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.


టిప్పర్ మంటలను అదుపులోనికి తెస్తున్న ఫైర్‌సిబ్బంది

రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ


రైతుబీమాకు దరఖాస్తు చేసుకుంటున్న రైతులు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో రైతుబీమా దరఖాస్తుల స్వీకరణ కొనసాగుతున్నట్లు ఇన్‌చార్జి ఏఓ యాదగిరి సోమవారం తెలిపారు. నూతనంగా పట్టాభూమి పొందిన రైతులు వ్యవసాయ కార్యాలయంలో రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఆధార్, నామినీలో మార్పులు చేర్పుల కోసం ఈ నెల 30 మంగళవారం లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు స్వాతి, సుభాష్, మమత తదితరులున్నారు.

క్లుప్తంగా

ఆలయానికి భూమి విరాళం


గ్రామ పెద్దలకు భూమి దానపత్రం అందజేస్తున్న వెంకట్‌రెడ్డి

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని చండీ గ్రామంలో కొలువైన పోచమ్మ ఆలయానికి గ్రామానికి చెందిన పుల్లగుర్ల వెంకట్‌రెడ్డి సోమవారం 6 గుంటల భూమి విరాళంగా అందజేశారు. పోచమ్మ ఆలయానికి ఖాళీ స్థలం లేక బోనాల ఉత్సవాలు, ఇతర వేడుకలకు భక్తులు ఇబ్బందులు పడుతున్నందున అతను తన పట్టా భూమి నుంచి 6 గుంటల భూమి ఆలయం పేరిట దానపత్రం గ్రామ పెద్దలకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వెంకట్‌రెడ్డిని గ్రామస్తులు అభినందించారు. ఈ కార్యక్రమంలో సంజీవచారి, వెంకట్‌రెడ్డి, భిక్షపతిరెడ్డి, నర్సారెడ్డి, ముత్యంరెడ్డి, తదితరులు ఉన్నారు.

సద్వినియోగం చేసుకోండి


బోరుబావి తవ్వకం పనులు ప్రారంభిస్తున్న కాంగ్రెస్ నాయకులు

శివ్వంపేట(నర్సాపూర్): దాతలు గ్రామాభివృద్ధికి చేస్తున్న సేవలు ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నర్సాపూర్ తాలూకా ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో పీఏసీఎస్ చైర్మన్ వెంకట్‌రామిరెడ్డి సోమవారం బోరుబావి తవ్వకం పనులు ప్రారంభించారు. ప్రజల అవసరాల నిమిత్తం దాతలు ముందుకు వచ్చి సేవ కార్యాక్రమాలు చేపట్టడడంపై అభినందించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు సుహాసినిరెడ్డి, రవీందర్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, నవీన్‌గుప్తా, గంగాధర్, షఫీయొద్దీన్, తదితరులు ఉన్నారు.

మత్స్యశాఖ చైర్మన్‌ను కలిసిన నాయకులు


సాయికుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

వెల్దుర్తి(తూప్రాన్): రాష్ట్ర మత్స్యశాఖ కార్పొరేషన్ చైర్మన్‌గా మెట్టు సాయికుమార్ ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో ముదిరాజ్ మహాసభ జిల్లా నాయకులు ఆయనను మర్యాద పూర్వకంగా కలిశారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ప్యాట స్వామిముదిరాజ్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మత్స్యవృత్తిపై ఆధారపడి జీవిస్తున్న కుటుంబాలకు అండగా ఉండాలని కోరారు.

ప్రజలు బుద్ధిచెప్పినా.. పార్టీల తీరు మారలె


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

కౌడిపల్లి(నర్సాపూర్): ఓటుతో బీఆర్ఎస్, బీజేపీలకు ప్రజలు బుద్ధి చెప్పినా.. మారడంలేదని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం కౌడిపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఆరుగ్యారంటీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడం తప్ప ఆపార్టీలు ప్రజలకు చేసిందేమిలేదన్నారు. ప్రజలకు మేలు చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శిస్తే సహించేదిలేదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు గోవర్ధన్‌రెడ్డి, చిన్నంరెడ్డి, పాషా, రఘు, ప్రవీణ్‌రెడ్డి, శ్రీనివాస్‌నాయక్, నర్సింలు పాల్గొన్నారు.

అన్నదానం

టేక్మాల్(మెదక్): ఆషాఢమాసం పురస్కరించుకొని మండల కేంద్రమైన టేక్మాల్ మహంకాళి దేవాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. దేవాలయం వద్ద వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన బోగం నర్సమ్మ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ఇందులో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఈత మొక్కలు నాటి సంరక్షించాలి


వెల్మకన్నలో చెరువు కట్టపై ఈత మొక్కలు నాటుతున్న ఎక్సైజ్ అధికారులు

ఎక్సైజ్ అధికారులు

కౌడిపల్లి(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా సోమవారం మండలంలోని వెల్మకన్న, కొట్టాల, లింగంపల్లి గ్రామాల్లో ఎక్సైజ్ అధికారులు గ్రామస్తులతో కలిసి ఈత మొక్కలు నాటారు. వెల్మకన్న అమ్మక చెరువు కట్టపై ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్‌రావు, మాజీ సర్పంచ్ రాజేందర్, పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌రెడ్డి తదితరులు మొక్కలు నాటారు. గ్రామాల్లో స్వచ్ఛమైన కల్లుకోసం ఈత మొక్కలు నాటి సంరక్షించాలని తెలిపారు. దీంతో పాటు కొట్టాల, లింగంపల్లి గ్రామాల్లో ఈత మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొట్టాల పంచాయతీ కార్యదర్శి మల్లేశం, ఎక్సైజ్ అధికారులు అజీజ్, తిరుమలయ్య, ప్రణయ్‌కుమార్, సాయికిరణ్, అన్నపూర్ణ, మాజీ సర్పంచ్ గంగాగౌడ్, ప్రశాంత్‌గౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిట్కుల్‌లో ప్లాంటేషన్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వన మహోత్సవంలో భాగంగా మండలంలోని చిట్కుల్ గ్రామంలో కమ్యూనిటి ప్లాంటేషన్ నిర్వహించామని పంచాయతీ కార్యదర్శి తిరుపతి అన్నారు. సోమవారం ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామంలో లక్ష్యం మేరకు మొక్కలు నాటామని, గ్రామంలోని ప్రతి ఇంటి ఆవరణలో నాటేందుకు ఇంటింటికీ ఆరు మొక్కలు సైతం పంపిణీ చేశామని చెప్పారు. నాటిన మొక్కలను గ్రామస్తులు బాధ్యతగా సంరక్షించాలన్నారు. నాటిన మొక్కలను ఎవరైన ధ్వంసం చేస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.


చిలప్‌చెడ్(నర్సాపూర్): చిట్కుల్‌లో మొక్కలు నాటుతున్న కార్యదర్శి తిరుపతి

చలో ఢిల్లీ జయప్రదం చేయండి

వెల్దుర్తి(తూప్రాన్): ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించాలని టీఎస్ ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆగస్టు 6న తలపెట్టిన చలో ఢిల్లీ, వంగపల్లి దీక్షకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను మండల కేంద్రం మాసాయిపేటలో ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మాదిగ, మాదిగ ఉపకులాల ప్రజలు, వర్గీకరణ కోరుకునే శక్తులు దీక్షలో పాల్గొనాలని కోరారు. ఉద్యమానికి అండగా నిలుస్తున్న మేధావులు, ప్రజాసంఘాలు, పార్టీల పెద్దలు వేలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు బాలసాయి హరిప్రసాద్, జిల్లా కార్యదర్శి భిక్షపతి, స్వామి, సిద్ధిరాములు, రాకేశ్, శేఖర్, బాబు తదితరులు పాల్గొన్నారు.


మాసాయిపేటలో చలో ఢిల్లీ వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

వైభవంగా బోనాల ఊరేగింపు


కొడిపల్లి(నర్సాపూర్): బోనాల ఊరేగింపులో భక్తులు

నర్సాపూర్: ఆషాఢమాసంలో భాగంగా రెండో రోజు పట్టణంలో ప్రజలు అమ్మవార్లకు బండ్లు, బోనాలు తీశారు. పట్టణంలోని భూలక్ష్మమ్మ, దుర్గమాత, నల్లపోచమ్మ అమ్మవార్లకు సోమవారం ప్రజలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించి, పూజలు చేశారు. రాత్రి బండ్లను ఊరేగించారు. కాగా పూజల్లో మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ కార్యవర్గ సభ్యుడు మురళీయాదవ్, ఆయా పార్టీల నాయకులు, కౌన్సిలర్లు, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి తదితరులు ఆయా ఆలయాలకు వెళ్లి పూజలు చేశారు.


ఫలహారం బండి వద్ద పూజలు చేస్తున్న మున్సిపల్ చైర్మన్, నాయకులు


కౌడిపల్లి: వెంకటాపూర్(ఆర్)లో బోనాలతో భక్తులు

వెంకటాపూర్(ఆర్)లో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెంకటాపూర్(ఆర్) గ్రామంలో బోనాల పండుగను గ్రామస్తులు ఘనంగా జరుపుకొన్నారు. సోమవారం గ్రామదేవతలు పోచమ్మ, ఎల్లమ్మకు గ్రామస్తులు డప్పు చప్పుడుతో బోనాలు తీసి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రశేఖర్‌గుప్తా, నాయకులు భాస్కర్‌రెడ్డి, వెంకట్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గుండ్లపల్లి గ్రామంలో..

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని గుండ్లపల్లి గ్రామంలో బోనాల మహోత్సవం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ ఉత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం గ్రామంలో కొలువైన ఎల్లమ్మ, మైసమ్మ గ్రామ దేవతలకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. పూజ మహోత్సవంలో కాంగ్రెస్ నర్సాపూర్ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు సుహాసినిరెడ్డి, నవీన్‌గుప్తా, వెంకట్‌రామిరెడ్డి, లక్ష్మీకాంతరావు, బండారి గంగాధర్ తో పాటు తదితరులు ఉన్నారు.


తూప్రాన్: ఉత్సవాల్లో భవిష్యవాణి వినిపిస్తున్న సాయికిరణ్


ఎడ్ల బండ్ల ఊరేగింపులో భక్తులు


నల్లపోచమ్మ ఆలయం వద్ద జడ్జి

పోచమ్మతల్లికి జడ్జి పూజలు

నర్సాపూర్: పట్టణంలో బోనాల పండుగ రెండో రోజు వైభవంగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా సోమవారం పట్టణంలోని నల్లపోచమ్మ అమ్మవారికి జూనియర్ సివిల్ జడ్జి కె.అనిత పూజలు చేశారు.

తూప్రాన్‌లో

తూప్రాన్: మున్సిపాలిటీ కేంద్రంలో బోనాల ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు సోమవారం మహంకాళి బోనాల జాతర ఉత్సవాలు మున్సిపల్ చైర్‌పర్సన్ మామిళ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గావురంగం, భవిష్యవాణి నిర్వహించారు. భవిష్యవాణిని ఏర్పుల సాయికిరణ్ వినిపించారు. ఆయా యువజన సంఘాల నాయకులు తొట్టెల, పాలహారం బండ్లను ఊరేగించారు. ఈ ఉత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు చర్యలు తీసుకున్నారు.